## క్లుప్తంగా

### చేనేత ఐక్య వేదిక యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శిగా సురేష్


గుర్రం సురేష్

డిండి : చేనేత యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన గుర్రం సురేశ్‌ను నియమించినట్లు చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు అప్పజెప్పిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ చేనేత సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సురేష్ తెలిపారు.

### ఘనంగా గ్యార్మీ వేడుకలు


పెద్దదేవులపల్లిలో గ్యార్మీ వేడుకల్లో ప్రార్థన చేస్తున్న వెంకటేశ్వర్లు

త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లిలో ముస్లిం సోదరులు మూకుమ్మడిగా గార్మీ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి సమీపంలో ఉన్న దర్గాలో ప్రత్యేక ప్రార్థలను నిర్వహించారు. పెద్దదేవులపల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్ గుండెబోయిన వెంకటేశ్వర్లు గార్మీ వేడుకల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జానపాటి సతీష్, ఖాసీం, ఖాజా, మంత్రి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### నందికొండ గృహవాసులకు అద్దె నోటీసులు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలటీ పరిధిలోని గృహాలకు పాత అద్దె బకాయిలు చెల్లించాలని శనివారం అధికారులు నోటీసులు జారీ చేశారు. నందికొండ మున్సిపాలటీ ఏర్పాటు సమయంలో అప్పటి సీఎం కేసీఆర్ నాగార్జునసాగర్ లో నివసించే వారికే గృహాలు ఇచ్చే కార్యక్రమంలో కొన్ని గృహాలకు రిజిస్ట్రేషన్ పక్రియ పూర్తి చేశారు. కానీ ఇప్పుడు దానికి పరిస్థితికి భిన్నంగా మిగిలిన సగం గృహాలకు అద్దె చెల్లించాలంటూ నోటీసులు ఇవ్వడమేమిటని ప్రజలు వాపోతున్నారు. గతంలో హామీలు ఇచ్చిన రాజకీయ నాయకులు ఇప్పుడు ఏమీ చేస్తారో వేచి చూడాలి.

### విద్యుదాఘాతంతో గేదె మృతి


మృతి చెందిన గేదె

త్రిపురారం : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిందిన సంఘటన నిడమనూరు మండలంలోని పార్వతి పురం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలంలోని పార్వతీపురం గ్రామానికి చెందిన రైతు సంకూరి శ్రీను వ్యవసాయంతో పాటుగా గేదెలను సాకుతున్నారు. గ్రామంలో వరి కొతలు కోయడంతో రోజు మాదిరిగానే గేదెలను మేత కోసం సమీపంలో ఉన్న పొలాలకు తోలుకెళ్లారు. గేదెలు మేత మేసుకుంటు వ్యవసాయ పొలాలకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ స్తంభం వైపు వెళ్లింది. అప్పటికే విద్యుత్ మోటార్‌కు ఏర్పాటు చేసుకున్న కరెంటు తీగ తెగి ఉండడంతో విద్యుత్ సరఫరా అవుతుండడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే గేదె మృతి చెందినట్లు తెలిపారు. గేదె విలువ సుమారు రూ. 85వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

### రేషన్ బియ్యం పట్టివేత

గుర్రంపోడు : మండలలలోని పోచంపల్లి గ్రామంలో ఆదివారం పోలీసులు జరిపిన ఆకస్మిక దాడుల్లో 10.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ మధు తెలిపారు. తేలుకుంట్ల యాదయ్య, దాచేపల్లి వెంకటయ్యల వద్ద నుంచి రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### ఓటు వజ్రాయుధం లాంటింది


ఓటర్ క్యాంపెయిన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

పెద్దవూర : ప్రజాసామ్య దేశంలో ఓటు వజ్రాయుధంలాంటిదని తహసీల్దార్ సరోజా పావని అన్నారు. ఆదివారం మండలంలోని బట్టు గూడెం, వెలమగూడెం, పెద్దవూర, పర్వేదుల, తుంగతుర్తి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18ఏళ్లు నిండిని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు ఉండేలా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, బీఎల్ఓ కత్తి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలంతా సర్వేకు సహకరించాలి

● అదనపు కలెక్టర్ శ్రీనివాస్


హాలియా : సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్


డిండి : వీరబోయినపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆంజనేయులు


త్రిపురారం : నిడమనూరులో సర్వేను పరిశీలిస్తున్న మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం

హాలియా : సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. హాలియా మున్సిపాలిటీలో ఆదివారం ఆయన పర్యటించి సర్వేను పరిశీలించారు. ఫామ్‌లో కోడ్ల ఆధారంగా అన్ని వివరాలు సక్రమంగా నమోదు చేస్తున్నారా, లేదా ఆరా తీశారు. ఎన్యుమరేటర్లకు ప్రజలు సమగ్ర సమాచారాన్ని అందించాలని, తద్వారా పథకాల అమలుపై ప్రభుత్వానికి స్పష్టత వస్తుందన్నారు. అదే విధంగా ఓటర్ల స్పెషల్ డ్రైవ్ సందర్భంగా మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పోలింగ్ బూత్‌లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామ దుర్గారెడ్డి, మేనేజర్ అబ్దుల్ రషీద్, ఇంచార్జ్ తహసీల్దార్ రఘు, ఆర్ఐ నవీన్, ఏఎస్ఓ రవినాయక్, బీఎల్ఓలు గోవిందమ్మ, వజ్రమ్మ తదితరులు ఉన్నారు.

**కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే**

డిండి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆదివారం మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా మండల పరిధిలోని వీరబోయనపల్లిలో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ వెంకన్న పరిశీలించారు. ఈ క్రమంలో ప్రజలకు వచ్చిన పలు సందేహాలకు వారు సమాధానం ఇస్తూ సర్వేకు సహకరించాలని సూచించారు.

**సర్వే గురించి ముందుగానే తెలియపర్చాలి**

నాగార్జునాసాగర్ : సమగ్ర సర్వే చేయనున్న బ్లాక్ పరిధిలోని ప్రజలకు ముందుగానే తెలియజేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం నాగార్జునాసాగర్ పరిధిలో నందికొండ మున్సిపాలటీలో నిర్వహిస్తున్న సమగ్ర సర్వే ప్రక్రియను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్ల సర్వేను పరిశీలించారు. వివరాలు ఎలా సేకరిస్తున్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆరో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు స్టిక్కరింగ్ పూర్తయిందని, 9న సమగ్ర సర్వే ప్రారంభమైందన్నారు. జిల్లా వ్యాప్తంగా 3970 బ్లాకుల్లో సుమారు 509000ఇళ్లు ఉన్నాయని వాటిలో మొదటి రోజులన 25324 ఇళ్లను సర్వే చేయనున్నటుతెలిపారు. సర్వేకు వచ్చే సిబ్బందికి డాక్యుమెంట్‌లు ఏవీ కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని ఆధార్, ధరణి లాంటి ధ్రువపత్రాలు చూపిస్తే సరిపోతుందన్నారు. ఈ సమావేశంలో పెద్దవూర తహసీల్దార్ సరోజ, మున్సిపాలటీ ఇన్‌చార్జ్ కమిషనర్ రామదుర్గారెడ్డి, ఆర్ఐ దండా శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చందంపేట : మండలంలోని పొగిళ్ల, కంబాలపల్లి గ్రామాల్లో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆదివారం దేవరకొండ ఆర్డీఓ మరణారెడ్డి పరిశీలించారు. సర్వే తీరు, సర్వే ఫారం నమోదు ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నజీర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం : నిడమనూరు, త్రిపురారం మండలాల వ్యాప్తంగా గ్రామాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుల గణన సర్వే కొనసాగుతుంది. ఆదివారం నిడమనూరు మండల కేంద్రంలో నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో నిడమనూరు వ్యవసాయాదికారి ముని కృష్ణయ్య, ఉన్నం చిన్న వీరయ్య, మేరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## మద్దతు ధర ఇవ్వకుంటే ఫోన్ చేయండి

● మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ధాన్యానికి మద్దతు ధర లభించని పక్షంలో రైస్‌మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయకుంటే నేరుగా తనకు ఫోన్ చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రైతులకు భరోసా కల్పించారు. రైతులకు 24గంటల పాటు తాను అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఆదివారం ఆయన పట్టణ పరిసరాల్లో గల రైస్ మిల్లుల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడి తన ఫోన్ నంబర్ ఇచ్చారు. రైస్ మిల్లుల్లో రైతులకు లభిస్తున్న ధర విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన రైస్ మిల్లు యజమానులతో మాట్లాడుతూ మద్దతు ధరకు ఒక్క రూపాయి కూడా తక్కువగా ధాన్యాన్ని కొనుగోలు చేయరాదని, రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవన్నారు. రైతులు ధాన్యం విక్రయించే విషయంలో తొందరపడరాదని, మిల్లర్లు కొనుగోలు చేయని పక్షంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు సన్నరకం ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.500 బోనస్ పొందాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎవరూ అసత్య ప్రచారాలు చేసి రైతులను భయాందోళనకు గురి చేయకూడదని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు సహనంతో ఉండి ధాన్యానికి మద్దతు ధర పొందాలని, ధర లభించని పక్షంలో వెంటనే ఫోన్ చేసి తనను సంప్రదించాలని, తమ ధాన్యానికి మద్దతు ధర ఇప్పిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## కార్మికులకు అండగా ఉండేది ఎర్రజెండానే



సమావేశంలో మాట్లాడుతున్న సయీద్

మిర్యాలగూడ టౌన్ : కార్మికులకు సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం అండగా నిలిచేది ఒక్క ఎర్రజెండా మాత్రమేనని ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి సయీద్ అన్నారు. ఆదివారం పలువురు ఆటో కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. వారికి కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటాలను నిర్వహిస్తున్న కార్మిక సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం నూతన ఆటో యూనియన్ కార్యవర్గాన్ని నియమించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా వలపట్ల వెంకన్న, అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్‌కె రహీం, ఎస్‌కె జానీ, కోశాధికారిగా వల్లపుదాసు అంటోని, ఉపాధ్యక్షులుగా ఉపేందర్, అన్వర్, కార్యవర్గ సభ్యులుగా యూసుఫ్, అజీజ్, అన్వర్, నసీర్‌పాష, ఉపేందర్, కృష్ణ, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం


త్రిపురారం : స్నేహితుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు


కొండమల్లేపల్లి : ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

త్రిపురారం : మండలంలోని పెద్దదేవుల పల్లి గ్రామానికి చెందిన సింగం శంకర్ అనారోగ్య కారణాలతో ఇటీవల మృతిచెందాడు. దీంతో మండలంలోని పెద్ద దేవులపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-2009 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న తోటి స్నేహితులు ముకుమ్మడిగా కలిసి పోగు చేసిన రూ. 26000 పెద్ద దేవులపల్లిలో సిగం శంకర్ కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా తోటి స్నేహితుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం స్నేహితుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్నేహితుడి కుటుంబ పేదరికంలో ఉందని తెలుసుకొని, మానవత్వంతో కలసి చదువుకున్న స్నేహితునికి తోటి పూర్వ స్నేహితులు అందించిన సాహయాన్ని గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన పంగ శ్రీను ఇటీవల గుండెపోటుతో మరణించడంతో అతడి పదో తరగతి స్నేహితులు ఆదివారం గుమ్మడవెల్లి గ్రామానికి వెళ్లి పంగ శ్రీను కుటుంబానికి రూ.75వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ క్రాంతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుంటోజు ఆంజనేయులు, పంగ యాదయ్య, ఆరిఫ్, మధు, శివ, హిమాకర్, యుగేంద్రరెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

### శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

చింతపల్లి : నల్లగొండ జిల్లా ఏఐటీయూసీ రాజకీయ శిక్షణ తరగతులు విజయవంతం చేయాలని ఎఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల11న మిర్యాలగూడ కరీం ఫంక్షన్ హాల్ లో నిర్వహించనున్న శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని కోరారు. దేశానికి స్వతంత్రం రాకముందే 20ఏళ్ల ముందే ఏర్పడిన మొట్టమొదటి కార్మికసంఘం ఏఐటీయూసీ అని,కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సుదీర్ఘ పోరాటాలు చేస్తూ, కేంద్ర ప్రభుత్వం 44 కోడ్‌ల ఉన్న చట్టాలను 4 కోడ్‌లుగా కుదించి కార్పొరేట్, పెట్టుబడిదారులకు, అనుగుణంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు రాజకీయ పరిస్థితులపై ,చట్టాలపై అవగాహన కల్పించడం కోసం 11న మిర్యాలగూడలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్మికులు పాల్గొని విజయవంతం చేయగలరని పిలుపునిచ్చారు.

## రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఉద్యమించాలి


నిడమనూరు మార్కెట్ చైర్మన్‌ను సన్మానిస్తున్న బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు

త్రిపురారం : రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ అన్నారు. నిడమనూరు మండలంలోని పార్వతిపురం గ్రామానికి చెందిన అంకతి సత్యనారాయణ(సత్యం) ఇటీవల నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఆదివారం నిడమనూరు మండల కేంద్రంలో మార్కెట్ యార్డుల్లో జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యంను మార్యాద పూర్వకంగా కలిసిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. అనంతరం రాపోలు పరమేష్ మాట్లాడుతూ.. జనాభా దామాష ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వనాదుల రాణి రమేష్ చారి, బీసీ సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి కోమటి వెంకన్న, గాయల వాడ లక్ష్మీ నారాయణ, పగిళ్ల శివ, తడుమిళ్ల వెంకటా చారి, జ్ఞానేశ్వర చారి, కొమ్మగోని శ్రీనివాస్, శంకర పాల్గొన్నారు.

## మహాపడి పూజ పోస్టర్ ఆవిష్కరణ


బట్టుగూడెంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న అయ్యప్పమాలధారులు

పెద్దవూర : ఈ నెల 15వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వహిస్తున్న అయ్యప్ప మహాపడి పూజ పోస్టర్‌ను మండలంలోని బట్టుగూడెం ఇష్టకామేశ్వరి స్వామి ఆలయంలోని అయ్యప్ప మాలధారణ స్వాములు ఆదివారం ఆవిష్కరించారు. పవిత్రమైన కార్తీక పౌర్ణమి రోజు సాయంత్రం మునగాల రామారావు గురు స్వామి సమక్ష్యంలో మహాపడి పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాజేష్ గురు స్వామి ప్రత్యేక భజన కార్యక్రమం ఉంటుందన్నారు. అయ్యప్ప, ఆంజనేయ, శివ మాలధారణ స్వాములు పెద్ద ఎత్తున్న హాజరై పడిపూజను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాసర్ల శంకర్, సైదిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, ఏడుకొండలు, సత్యానారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, సతీష్ రెడ్డి, మల్లేశ్, శ్రీరాములు, రాహుల్ రెడ్డి, శంకర్ రెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

## సాయి మందిరంలో వార్షికోత్సవ పూజలు


ఆలయంలో కలశ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హాలియా : పట్టణంలోని షిర్డీ సాయి మందిరంలో 19వ వార్షికోత్సవ మహోత్సవ పూజలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మనోజ్ పాండేయ్ ఆధ్వర్యంలో ఆలయంలో కాగడ హారతి, బాబా వారికి 108 కలశాలతో అభిషేకాలు , చందనోత్సవం, సంస్థాన్ హారతి, ధునిపూజ, సామూహిక భజన, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణము తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం షిర్డి సాయినాథుడిని పల్లకిలోకి కూర్చొబెట్టి హాలియా పట్టణంలోని పురువీధుల్లో ఊరేంగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తేలపోలు శేఖర్, కార్యదర్శి బాణోతు సక్రునాయక్, కోశాధికారి మిట్టపల్లి శివకుమార్, ఆలయ ధర్మకర్త మిట్టపల్లి సుబ్బారావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

### జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


ఇస్లావత్ మౌనిక

డిండి : యాదాద్రి, భువనగిరి జిల్లాలోని మాదాపూర్ లో ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొన్న మండల పరిధిలోని చెర్కుపల్లి ప్రభుత్వ జెడ్పీహైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న ఇస్లావత్ మౌనిక తన ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓ గోప్యానాయక్ ఆదివారం ఒక ప్రకటలో తెలి పారు. ఈ సందర్భంగా పేద, గిరిజన కుటుంబానికి చెందిన మౌనిక రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో నల్లగొండ జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తూ ప్రతిభను కనపరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై పాఠశాల ఉపధ్యాయులు, మండల ప్రజలు మౌనికను అభినందించారు.

## వెలవెలబోతున్న సన్నధాన్యం కొనుగోలు కేంద్రం


చింతకుంట్ల ఎక్స్ రోడ్డు వద్ద వెలవెలబోతున్న సన్న ధాన్యం కొనుగోలు కేంద్రం

కొండమల్లేపల్లి : మండల పరిధిలో వ్యవసాయ సహకార కేంద్రం ఆధ్వర్యంలో మూడు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే పెండ్లిపాకల, చిన్నఅడిశర్లపల్లి ధాన్యం కేంద్రాలను దొడ్డు రకం ధాన్యానికి కేటాయించగా చింతకుంట్ల ఎక్స్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన సన్న వడ్ల ధాన్యం కేంద్రంలో ఇప్పటి వరకు ఎలాంటి ధాన్యం రాకపోవడంతో ఈ కేంద్రం వెలవెలబోతుంది. సన్న ధాన్యాన్ని పండించే రైతులు నేరుగా మిల్లులకు చేరవేస్తున్నారని పలువురు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కేంద్రాల్లో మ్యాచర్‌రాకపోవడంతో కొనడానికి ఎక్కువ రోజులు సమయం తీసుకుంటున్నారని, దీని వల్ల అకాల వర్షాలతో నష్టపోయే అవకాశం ఉందనే కారణంతో రైతులు నేరుగా మిల్లులకు చేరవేస్తున్నట్లు సమాచారం.

### పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే చెల్లించాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీఓ నంబర్ 317 ద్వారా ఇతర జిల్లాలకు కేటాయించిన ఉద్యోగ, ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించాలన్నారు. ఈ జీఓ పరిధిలో ఉన్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఉద్యోగులకు చెందిన పీఆర్‌సీ అమలు చేయాలని, డీఏ చెల్లించే విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపట్టాలన్నారు. ఉద్యోగులు సమస్యల పరిష్కారం అవుతాయనే ఆశతో ఎదురు చూస్తున్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు గోపి, రవి, మక్లానాయక్, రమేష్, చందు, లక్ష్మణ్ తదితరులున్నారు.

### నేషనల్ ఎడ్యుకేషన్ డే సెమినార్

రామగిరి (నల్లగొండ): అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆదివారం నల్లగొండలోని టీఎన్‌జీఓ భవనంలో యునైటెడ్ ముస్లిం మైనారిటీ రైట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నేషనల్ ఎడ్యుకేషన్ డే సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ముస్లిం మైనారిటీ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ నజీర్ మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యత, విద్యకు దూరమవుతున్న కొన్ని వర్గాలకు విద్యపై అవగాహన కల్పిస్తూ చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం అధ్యాపకులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్‌పాష, డాక్టర్ యేకుల రాజారావు, డాక్టర్ అన్సారీ, మసియుద్దీన్, ఖాజా ముహిత్, కొండ లలిత, నజీర్, రఫీ, షేక్ సద్దాం, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

### టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వర్‌రావు

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ జనసమితి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మిర్యాలగూడకు చెందిన గుండెబోయిన నాగేశ్వర్‌రావు, కార్యదర్శిగా లావూడి క్రాంతికుమార్‌ను నియమిస్తూ ఈనెల 9న నల్లగొండలో నిర్వహించిన ప్లీనరీలో ఎమ్మెల్సీ కోదండరాం ఈ ప్రకటన చేసినట్లు నాగేశ్వర్‌రావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. తమ నియమకానికి అన్ని విధాలుగా సహకరించిన ఎమ్మెల్సీ కోదండరాంకు, జిల్లా అధ్యక్షులు పన్నాల గోపాల్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆకట్టుకున్న సదర్ సమ్మేళనం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

రామగిరి (నల్లగొండ) : కాంగ్రెస్ ప్రభుత్వం సదర్ సమ్మేళనాన్ని అధికారికంగా నిర్వహిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం రాత్రి నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన సదర్ సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలతో కలిసి మెలిసి జీవించే మనస్తత్వం యాదవులకుందని అన్నారు. సదర్ వల్ల అన్ని వర్గాల ప్రజల్లో ఐక్యత భావం పెరుగుతుందని, ఈ ఉత్సవం గ్రామీణ ప్రాంతాలకు వ్యాప్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలించారు. పోతురాజుల ఆటలు, దున్నపోతుల విన్యాసాలను తిలకించేందుకు జనాలు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో చిన్న శ్రీశైలంయాదవ్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, నిర్వాహకులు మేకల యాదన్నయాదవ్, దూదిమెట్ల సత్తయ్య, పిల్లి రామరాజు, దుడుకు లక్ష్మీనారాయణ, ఎల్.వి.యాదవ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వట్టి జానయ్యయాదవ్, సత్యానారాయణ, శివకుమార్, వంశీకుమార్, సంగి లక్ష్మణ్, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా ఓటరు నమోదు

● కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్
● జనవరి 1నాటికి 18ఏళ్లు నిండిన వారికి అవకాశం


కమలాపూర్‌లో బీఎల్‌ఓని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీఓ

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గంలో ఓటరు నమోదు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18ఏళ్లు నిండే వారు కొత్తగా తమ ఓటు హక్కును నమోదు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిం ది. అంతేగాకుండా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులతో పాటు బోగస్ ఓటర్ల ఏరివేత, మృతుల పేర్లు తొలగింపు, ఓటర్‌కార్డుకు ఆధార్ అనుసంధానం, కొత్త దరఖాస్తుల స్వీకరణ, వంటి చర్యలు చేపట్టేందుకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు, సూచనల మేరకు చర్యలు చేపట్టేందుకు రెవెన్యూ అధికారులు కార్యాచరణ రూపొందించారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అర్హులందరికీ ఓటు హక్కు కల్పించి వందశాతం ఓటరు నమోదు లక్ష్యంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు ముందుకెళ్తున్నారు.

**దరఖాస్తుల స్వీకరణ**

ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ కార్యక్రమంలో భాగంగా బీఎల్‌ఓలు ఇప్పటికే పోలింగ్ పోలింగ్ బూత్‌లలో దరఖాస్తులు స్వీకరించారు .ఈ మేరకు ఎప్పటికప్పుడు సంబంధిత వివరాలను అధికారులు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. కాగా శనివారం, ఆదివారాల్లో సైతం ఆయా మండలాల్లో అధికారులు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ఓటు నమోదుకు అవకాశం కల్పించారు.ఇదిలా ఉంటే ఆయా పోలింగ్ కేంద్రాల్లో బూత్‌స్థాయి అధికారులు ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉంటూ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.కాగా నియోజకవర్గ వ్యాప్తంగా 186దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఓటరు నమోదుకు గాను అర్హులు ఆల్‌లైన్‌లో సైతం తమ ఓటును నమోదు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. దీనికి సంబంధించి జనవరి 6వ తేదిన తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి**


కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ కల్పించిన అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలి.2025 జనవరి 1నాటికి 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదుచేసుకోవాలి. అర్హులు ఎవరైనా తమ ఓటును ఆన్‌లైన్‌లో సైతం నమోదు చేసుకోవచ్చు.

\- రమణారెడ్డి, ఆర్డీఓ, దేవరకొండ